మనతోనే మలేరియా అంతం



- గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు చేరువైన వైద్య సేవలు
- నివారణ చర్యలతో తగ్గుతున్న ఉధృతి
- దోమల నియంత్రణపై అవగాహన అవసరం
- నేడు ప్రపంచ మలేరియా డే



విద్యార్థులకు మలేరియాపై అవగాహన కల్పిస్తున్న అధికారి నగేష్ పట్నాయక్



దోమల నియంత్రణకు ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సీతంపేట: చలితో కూడిన జ్వరం మలేరియాకు సంకేతం. రక్త పరీక్షలో మలేరియా అని నిర్ధారణ అయితే మూల చికిత్స సకాలంలో వాడకుంటే మరణానికి చేరువయినట్టే. అంతటి ప్రాణాంతక మైన జ్వరం మలేరియా. గిరిజన, గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా వణికించిన మలేరియా జ్వరాలు కొన్నేళ్లుగా వైద్యారోగ్యశాఖ అనుసరిస్తున్న నియంత్రణ చర్యలతో తగ్గుముఖం పడుతున్నాయి. 2027 నాటికి మలేరియాను అంతం చేసే దిశగా ప్రత్యేక ప్రణాళికతో వైద్య ఆరోగ్య శాఖ ముందుకు సాగుతోంది. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం డే.

ప్రతి ఏటా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు మలేరియ జ్వరాలు సంభవించే అవకాశం ఉంది.

సబ్ యూనిట్ పరిధిలో మలేరియా పాజిటివ్ కేసుల వివరాలివి

సంవత్సరం	మలేరియా	2024	71
2022	42	2025	25
2023	84	(ఏప్రిల్ 24 వరకు)	

ఒకప్పుడు పదుల సంఖ్యలో మలేరియా కేసులు నమోదయ్యేవి. నగరంలో కొన్నేళ్లుగా మలేరియా పాజిటివ్ కేసుల సంఖ్య బాగా తగ్గుముఖం పట్టింది. దానికి ప్రధాన కారణం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రాలు, మెరుగైన మౌలిక సదుపాయాలతో వైద్య సేవలు చేరువ చేయడం. సచివాలయం ఒక యూనిట్‌గా, ప్రతి సచివాలయం పరిధిలో ఒక ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్త ద్వారా వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. సచివాలయ వ్యవస్థ ద్వారా హెల్త్ సెక్రటరీలు, ఆశ కార్యకర్యలు, జీవీఎంసీ మలేరియా విభాగం, జిల్లా మలేరియా విభాగం సమన్వయంతో ప్రతి శుక్రవారం, మంగళవారం డ్రై డే డ్రైడే పటిష్టంగా నిర్వహించి

దోమల నియంత్రణపై అవగాహన



2020 నుంచి ఇప్పటి నగరంలో మలేరియా బారినపడే వారి సంఖ్య తగ్గింది. దోమల నియంత్రణకు ప్రతి సచివాలయం పరిధిలో శుక్ర, మంగళ వారాల్లో డ్రై డే నిర్వహిస్తున్నాం. హెల్త్ సెక్రటరీలు, ఆశ కార్యకర్తలు, జీవీఎంసీ యాంటీ లార్వా ఆపరేషన్స్ సిబ్బంది, జిల్లా మలేరియా విభాగం సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి దోమల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్నాం. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా జ్వరాలను వ్యాప్తి చేసే దోమలను అరికట్టాలంటే ప్రజల సహకారం తప్పనిసరి. ఇంటిలోపల, చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా చూడడం ద్వారా దోమలను నియంత్రించవచ్చు.

– నగేష్ పట్నాయక్, సబ్ యూనిట్ ఆఫీసర్ , మలేరియా విభాగం

మలేరియాపై పోరు

ఏటా ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా డే నిర్వహిస్తున్నారు. దోమల ద్వారా వ్యాపించే ప్రాణాంతకమైన మలేరియా జ్వరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, దోమ కాటు బారిన పడకుండా ఎటువంటి జాగ్రత్తలు వహించాలి తదితర అంశాలపై అవగాహన ర్యాలీలు, ఎగ్జిబిషన్లు, సమావేశాలు నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేస్తుంటారు. ఈ ఏడాది కూడా 'మలేరియా అంతం మనతోనే' అనే థీమ్‌తో మలేరియా డేను నిర్వహిస్తున్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే మలేరియాను అంతం చేయవచ్చని, అందరిలో మార్పు వస్తే మలేరియా అంతం సాధ్యమని ఈ థీమ్ ఉద్దేశం. వ్యాధి మూలాలను గుర్తించి.. నియంత్రణ చర్యలు చేపట్టడం ద్వారా 2027 నాటికి మలేరియాను అంతమొందించాలన్న లక్ష్యంతో జీవీఎంసీ మలేరియా విభాగం, జిల్లా మలేరియా విభాగం ముందుకు సాగుతున్నాయి. ప్రతి సచివాలయాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని గత మూడేళ్లలో నమోదైన మలేరియా కేసుల సంఖ్యను బట్టి ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో మలేరియాను అదుపు చేయడానికి ప్రణాళికలు రూపొందించారు.



నీటి నిల్వలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి తులసి

దోమల పెరుగుదలను నియంత్రించారు. ఫలితంగా ఆడ ఎనాఫిలస్ దోమ ఉధృతి తగ్గడంతో.. మలేరియా బారినపడే వారి సంఖ్య తగ్గుముఖం పట్టింది.

మలేరియా అంతం దిశగా అడుగులు



దోమలు పెరగకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలి. తాగి పారేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు, రుబ్బు రోళ్లు, మనీప్లాంట్లు, రిఫ్రిజిరేటర్లు, కూలర్లు దోమలు ఉత్పత్తి చెందే వనరులు. ప్రతి మూడు రోజులకు ఒక సారి వాటిలో నీటిని ఖాళీ చేయాలి. జిల్లాలో మొదటి విడతలో దబ్బంద, ఎన్‌జీఆర్ పురం, గంభీరం, చిన ఉప్పాడలో దోమలు మందు పిచికారీ చేయనున్నాం. అలాగే 75 వసతి గృహాల్లో జూన్ 15 నుంచి పిచికారీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. ప్రజలు దోమ తెరలు వాడాలి. మలేరియా బారినపడకుండా అవగాహన కలిప్పంచేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

–డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతమ్మధార: సీతమ్మధార 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ వుడా కాంప్లెక్స్ ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్-1 ఈఈ(ఆపరేషన్) బి.సింహాచలం నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు సీతమ్మధారలోని వుడా కాంప్లెక్స్, లా కాలేజీ, శ్రీ ప్రకాష్ స్కూల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

రైల్ క్లబ్‌లో వైద్య, రక్తదాన శిబిరాలు



రక్తదానం చేస్తున్న రైల్వే సిబ్బంది

తాటిచెట్లపాలెం: వైద్య విభాగం, వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం బ్లడ్ డోనార్స్ క్లబ్ నేతృత్వంలో డీఆర్‌ఎం లలిత్ బోరా సూచనలతో గురువారం రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్ క్లబ్‌లో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. విశాఖ బ్లడ్ డోనర్స్ క్లబ్, హెల్పింగ్ హార్ట్స్, రోటరీ బ్లడ్ బ్యాంక్‌లు సంయుక్తంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించాయి. స్థానిక ప్రజలు, రైల్వే ఉద్యోగుల్లో ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరాలను డీఆర్‌ఎం లలిత్ బోరా, విశాఖ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపకురాలు రాజకుమారి, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శరత్‌బాబుల సమక్షంలో ప్రారంభించారు.

సుమారు 200 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా, 50 యూనిట్ల రక్తం సేకరించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. రక్తదాతలకు డీఆర్‌ఎం ప్రశంసాపత్రాలు, మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో ఇతర సభ్యులు కమల్‌జీత్, చాయ, నరేష్, రత్నాకర్, రమణమూర్తి, రాజేష్, రమ్య, రామకృష్ణ, విజయ్, చెట్టి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బిలాల్ కాలనీలో కార్డన్ సెర్చ్



బిలాల్ కాలనీలోని ఓ ఇంట్లో తనిఖీలు చేస్తున్న ద్వారకా ఎస్‌ఐ ధర్మేంద్ర

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం సీతమ్మధార దరి బిలాల్ కాలనీలో ఎస్‌ఐ జె.ధర్మేంద్ర ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ద్వారకా సీఐ డి.వి.రమణ ఆదేశాల మేరకు తనిఖీలు చేశామని ఎస్‌ఐ తెలిపారు. మొత్తం 110 వాహనాలను పరిశీలించగా.. ఆరు ద్విచక్ర వాహనాలకు సరైన రికార్డులు లేవని గుర్తించామన్నారు. వాటిని సీజ్ చేసి, తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కొన్ని ఇళ్లలో కూడా తనిఖీలు చేశామని, ఎటువంటి అనుమానిత సమాచారం లభించలేదని ఎస్‌ఐ తెలిపారు. గంజాయి సేవించడం, విక్రయించడం, వీధుల్లో గొడవలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ద్వారకా పోలీసులు పాల్గొన్నారు.

పాలిసెట్ హాల్ టికెట్లు సిద్ధం

మురళీనగర్: పాలిసెట్ హాల్ టికెట్లు సిద్ధంగా ఉన్నాయని విశాఖ జిల్లా పాలిసెట్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.నారాయణ రావు ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసిన వారు పాలిసెట్ఏపీ.ఎస్‌బీటీఈ.ఇన్ వెబ్ సైట్‌లో నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఇందుకోసం కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాలిసెట్‌కు జిల్లాలో సుమారు 14,000 మంది దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఈనెల 30 తేదీన ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తామని చెప్పారు.

బస్సు ఢీకొని మహిళ దుర్మరణం



ఊర్వశి జంక్షన్ వద్ద మేరీ మృతదేహం

తాటిచెట్లపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మరణించగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా.. బర్మాక్యాంప్‌కు చెందిన ఎన్.మేరీ, తన కుమార్తెతో కలిసి ద్విచక్ర వాహనంపై తాటిచెట్లపాలెంలో ప్రార్థన నిమిత్తం బయల్దేరారు. వీరి వాహనం కంచరపాలెం ఊర్వశి జంక్షన్ వద్దకు వచ్చేసరికి విజయవాడ నుంచి పార్వతీపురం వెళ్తున్న ఇంద్ర ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో వాహనంపై వెనుక వైపు కూర్చున్న మేరీ బస్సు కింద పడి దుర్మరణం చెందారు. డ్రైవింగ్ చేస్తున్న కుమార్తె సుధారాణి తీవ్ర గాయాలతో 108 సహాయంతో ఎన్ఆర్ఐ హాస్పిటల్‌లో చేరారు.

మరో ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

తాటిచెట్లపాలెం జంక్షన్ నుంచి కంచరపాలేనికి వెళ్లే రహదారిలోని ఆశీర్వాద్ ఫంక్షన్ హాల్ సమీపంలో మరో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఓ మహిళకు తీవ్ర గాయాలైనట్లు తెలిసింది, కంచరపాలెం సీఐ దాశరథి ఈ రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరాశ్రయ వసతి గృహానికి అభాగ్యుల తరలింపు



డిశ్చార్జి అయిన రోగులతో ఏయూటీడీ కార్యదర్శి వాసు

సీతమ్మధార: చినవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకున్న అయిదుగురు పురుషులు, ఇద్దరు మహిళలను గురువారం డిశ్చార్జి చేశారు. వీరిని ద్వారకానగర్‌లోని టీఎస్సార్ కాంప్లెక్స్‌లో గల ఏయూటీడీ జీవిఎంసీ నిరాశ్రయ వసతిగృహాలకు తరలించారు. వీరిని కుటుంబ సభ్యులు తీసుకుళ్లడానికి రాకపోవడంతో ఏయూటీడీ సంస్థ స్వచ్ఛందంగా వీరికి ఆశ్రయం కల్పించింది. వారిచేత మందులు వాడిస్తూ, పూర్తి వివరాలు తెలుసుకుని శ్రద్ధా ఫౌండేషన్ సహకారంతో కుటుంబ సభ్యులకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నట్లు ఏయూటీడీ సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు శ్రద్ధా సోషల్ వర్కర్లు గౌతం , హరీష్ పాల్గొన్నారు

ఉగ్రవాదుల దాడులపై నిరసనలు



అబిడ్‌నగర్‌లో చంద్రమౌళి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్.వి.వి.రాజు



అక్కయ్యపాలెంలో నల్ల రిబ్బన్లతో నిరసన తెలుపుతున్న నాయకులు

సీతంపేట: ఉగ్రవాదుల దాడిలో మరణించిన విశాఖ వాసి చంద్రమౌళికి అబిడ్‌నగర్ నిర్వాసితుల సంక్షేమ సంఘం ప్రతినిధులు అశ్రు నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు ఎస్.వి.వి.రాజు ఆధ్వర్యంలో గురువారం అబిడ్‌నగర్ బస్టాప్ వద్ద జరిగిన కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు చంద్రమౌళి చిత్రపటానికి పూల మాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌బీఐ ఉద్యోగిగా చంద్రమౌళి చేసిన సేవలను కొనియాడారు. అమాయక యాత్రికులపై టెర్రరిస్టులు దాడి చేసి విచక్షణా రహితంగా కాల్పులు జరపడం చాలా దారుణమన్నారు. చంద్రమౌళి ఆత్మకు శాంతి కలగాలని, ఇటువంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలన్నారు.

ఉగ్రదాడి పిరికిపంద చర్య

అమాయక ప్రజలను ఉగ్రవాదులు కాల్చి చంపడం పాకిస్తాన్ పిరికిపంద చర్యని జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ అన్నారు. అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డులో జనసేన నాయకులు నోటికి నల్ల రిబ్బన్లు ధరించి మోకాళ్లపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, 26, 42, 43, 44 వార్డుల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

సీతమ్మధార: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జిల్లా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. గురువారం ద్వారకా నగర్ జంక్షన్ గురజాడ అప్పారావు విగ్రహం నుండుట లలితా జ్యుయలరీ, ఆశీలమెట్ట జంక్షన్ మీదుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. అనంతరం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్ క్లెయిమ్‌లన్నీ చెల్లించాలని, కొత్త కార్డులు రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ధర్నాలు జరుగుతున్నాయని తెలిపారు.

కె.కె.రాజుకు అభినందనల వెల్లువ



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజుతో 24వ వార్డు కార్పొరేటర్, నాయకులు



కె.కె.రాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న బాణాల శ్రీనివాస్, 42వ వార్డు నాయకులు



కె.కె.రాజును అభినందిస్తున్న అంబటి శైలేష్

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా నూతన అధ్యక్షుడు కె.కె.రాజుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సీతమ్మధార ఎంఎంటీసీ కాలనీలోని ఆయన కార్యాలయంలో గురువారం కె.కె.రాజును పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, పార్టీ వార్డు నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. పార్టీ 42వ వార్డు నాయకులు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్ తదితరులు కె.కె.రాజుకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఎయిర్‌పోర్ట్ కమిటీ మాజీ మెంబర్ అంబటి శైలేష్ కె.కె.రాజుకు అభినందనలు తెలియజేశారు.

ధ్యాన మందిరంలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది



బాబా పల్లకీ మోస్తున్న మహిళా భక్తులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ఓమ్ని గిగిల్స్, వాసన్ ఐ కేర్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానికులకు పలు వైద్య పరీక్షలను చేసి, తగు ఆరోగ్య సలహాలను హాస్పిటల్ సిబ్బంది అందించారు. ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరి రావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో వాసన్ ఐ కేర్ మార్కెటింగ్ సిబ్బంది చంటి, ఆప్టోమెట్రిస్ట్ ఉదయ్, ఓమ్ని గిగిల్స్ క్యాంప్ కో ఆర్డినేటర్ నరేష్, సిబ్బంది నర్సింగ్, భాగ్య పాల్గొన్నారు.


- ధ్యాన మందిరంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు.. రాత్రి నిర్వహించిన బాబా పల్లకీ సేవలో మహిళా భక్తులు పాల్గొని పల్లకీ మోశారు. బాబా భజన అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సెలవులపై వింత రూల్స్

- సెలవు పెడితే అవసరం లేని అధికారులకు చెప్పాలంట
- కేజీహెచ్ సూపరింటెండెంట్ ఉత్తర్వులపై ఉద్యోగుల ఆగ్రహం

డాబాగార్డెన్స్: కేజీహెచ్‌లో రోజుకో వింత రూల్ పుట్టుకొస్తుంది. ఈ రూల్స్‌తో ఉద్యోగులు, సిబ్బంది సతమతమవుతున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించే విషయంలో దృష్టి పెట్టని ఉన్నతాధికారులు.. పరిపాలన విభాగంలో లేనిపోని విధానాలు తెరపైకి తీసుకొచ్చి మానసికంగా వేధిస్తున్నారంటూ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ జారీ చేసిన ఉత్తర్వులు ఉద్యోగుల్లో కలకలం రేపుతుంది. వాస్తవానికి ఏదైనా కార్యాలయంలో ఉద్యోగి సెలవు పెడితే ఆయా విభాగానికి సంబంధించిన ఉన్నతాధికారి నుంచి అనుమతి తీసుకుంటే సరిపోతుంది. పై స్థాయి అధికారులకు ఆ సమాచారం అందించాల్సిన అవసరం ఉండదు. కేజీహెచ్‌లో మినిస్టీరియల్ సిబ్బంది అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ) పరిధిలో ఉంటారు. కార్యాలయంలోని మేనేజర్ సంతకంతో పాటు ఏడీ సంతకం తీసుకుని సెలవులకు వెళ్తే సరిపోతుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆసుపత్రుల్లో ఇదే విధానం అమలవుతోంది. కేజీహెచ్‌లో మాత్రం కింది స్థాయి ఉద్యోగి సెలవు పెడితే సూపరింటెండెంట్ అనుమతి, సంతకం తీసుకోవాలంటూ వింత రూల్ అమలు చేస్తున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లేనిపోని రూల్స్‌తో ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని, తక్షణమే సెలవుల మంజూరు, ఇతర విషయాలపై ఉన్నతాధికారికి కీలక బాధ్యతలు అప్పగించాలని కోరుతున్నారు.

ఘనంగా ముత్యమాంబ మారువారం



శాకంబరి అలంకరణలో ముత్యమాంబ



అన్నసమారాధన ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గవర కంచరపాలెం వాసుల ఆరాధ్య దైవం ముత్యమాంబ అమ్మవారి మారువారం పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామాభ్యుదయ సంఘం గ్రామాధ్యక్ష, కార్యదర్శులు మళ్ల రాంప్రసాద్, మళ్ల గౌరీరమేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు మజ్జిగ, శీతలపానీయాలు అందజేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనను కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ ఎమ్మెల్యే గణబాబు కుమారుడు మౌర్య ప్రారంభించారు. సుమారు 5వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం జరిగిన వేడుకల్లో పుట్టబంగారం వద్ద నుంచి అమ్మవారి ప్రతిమను ఆలయం వద్దకు చేర్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పాలకవర్గ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రేపు బీచ్ కబడ్డీ పోటీలకు విశాఖ జట్ల ఎంపిక

ఎంవీపీకాలనీ: రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లాల పురుషులు, మహిళల జట్లను ఈ నెల 26న ఎంపిక చేయనున్నట్లు విశాఖ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె.ఎస్.వి.ప్రసాదరెడ్డి తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు ఆర్కే బీచ్ వేదికగా ఈ జట్లు ఎంపిక జరుగుతుందన్నారు. 85 కేజీలలోపు పురుషులు, 75 కేజీలలోపు మహిళలు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన జట్లు మే 2 నుంచి 4వ తేదీ వరకు కాకినాడ బీచ్‌లో జరిగే 12వ రాష్ట్ర అంతర్ జిల్లాల బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో విశాఖ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. వివరాలకు 96666 55355, 80084 85344 నంబర్లను సంప్రదించాలని సూచించారు

రైల్వే ప్రయాణికుల సౌకర్యాలపై ఆకస్మిక తనిఖీలు



ప్యాంట్రీకార్‌లో తనిఖీలు చేస్తున్న సీనియర్ డీసీఎం సందీప్

తాటిచెట్లపాలెం: రైల్లో ప్రయాణిస్తున్న వారికి అందుతున్న సౌకర్యాలపై వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. విశాఖ నుంచి విజయనగరం–రాయగడ సెక్షన్‌ల పరిధిలో ఈ తనిఖీలు నిర్వహించారు. ఆన్ బోర్డు ప్రయాణికులకు రైల్లో అందుతున్న సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. హౌస్ కీపింగ్ సర్వీసెస్, బెడ్ రోల్స్, కోచ్‌ల్లో పరిశుభ్రత, ప్యాంట్రీకార్‌లో ప్రయాణికులకు అందజేస్తున్న ఆహార పదార్థాలు తదితర విషయాలు పరిశీలించారు. ప్రయాణికులు తమ సామగ్రి విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, అనుమానితులను నమ్మవద్దని, మొబైల్ దొంగతనాలు, మత్తు పదార్థాలు, రవాణా వంటి వాటిపై ఏమైనా సందేహాలుంటే, అనుమానాలున్నా 139కు సమాచారం అందించాలని సీనియర్ డీసీఎం సూచించారు. పలు రైళ్లలో కమర్షియల్ సిబ్బంది కూడా ప్రయాణిస్తూ తనిఖీలు నిర్వహించారు. సరైన టికెట్లు లేకుండా ప్రయాణిస్తున్న సుమారు 163 మంది ప్రయాణికులపై కేసులు నమోదు చేసి, వీరి వద్ద నుంచి లక్ష రూపాయలు జరిమానా వసూలు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళులు



పోప్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ తదితరులు

కంచరపాలెం: ప్రపంచ క్రైస్తవ నాయకులు పోప్ ఫ్రాన్సిస్ మరణానికి చింతిస్తూ జీవీఎంసీ 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ పార్టీ కార్యాలయంలో గురువారం నివాళులు అర్పించారు. విశ్వ క్యాథలిక్ సంఘ కాపరి, యావత్ క్రైస్తవ లోకానికి మార్గదర్శి పోప్ ఫ్రాన్సిస్ మరణం క్రైస్తవ లోకానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ప్రపంచం ఒక గొప్ప శాంతి దూతను కోల్పోయిందని ఆయన ఆత్మకు దేవుడు శాంతి ప్రశాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. శనివారం వాటికన్ నగరంలో భూస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వేళంగిణి రావు, పాత్రపిల్లి సునీల్‌కుమార్, ఎల్. కుమార్, కార్యకర్తలు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.